క్లుప్తంగా

8న మహతిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

తిరుపతి అలిపిరి: మహతి కళాక్షేత్రంలో ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించనున్నట్టు టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా రాయలచెరువుకు చెందిన శక్తి పీఠాధీశ్వరి మాతాజీ రమ్యానందభారతి, రేణిగుంట ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చర్ క్లస్టర్ సీఈవో గౌతమి, సీఐడీ ఎస్పీ సరిత ప్రసంగిస్తారని పేర్కొంది. ఎర్రావారిపాళెంకు చెందిన అంతర్జాతీయ హాకీ క్రీడాకారిణి రజనీ, జాతీయ ఉత్తమ మహిళా రైతు పురస్కారాన్ని గెలుచుకున్న ప్రకృతి వ్యవసాయ రైతు ఓబులమ్మ, ప్రముఖ పారిశ్రామికవేత్త, రత్న గ్రూపు సంస్థల చైర్ పర్సన్ రత్నారెడ్డిని సన్మానిస్తామని వెల్లడించింది. అదేవిధంగా పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల రూపశిల్పి డాక్టర్ కె.రాజేశ్వరి మూర్తి(101)కి 'శ్రీ పద్మావతి విద్యా ప్రకాశిని' అవార్డు ప్రదానం చేయనున్నట్టు తెలిపింది.

ఫ్రీ హియరింగ్ టెస్ట్‌కి విశేష స్పందన


హియరింగ్ టెస్ట్ చేస్తున్న వైద్యుడు

తిరుపతి తుడా : వరల్డ్ హియరింగ్ డే సందర్భంగా స్థానిక కొంకావీధిలోని తిరుపతి స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్‌లో రెండు రోజులు నిర్వహించిన ఫ్రీ హియరింగ్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. 120 మందికి టెస్ట్‌లు చేసి వారి వినికిడికి సంబంధించిన ఆడియోగ్రామ్ రిపోర్ట్ అందజేశారు. సమస్య ఉన్న వారికి తగిన జాగ్రత్తలు, సలహాలు, చికిత్స విధానాలు తెలియజేసినట్లు నిర్వాహకులు డాక్టర్ గోపీనాథ్ తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న సుప్రీం కోర్టు జడ్జి



తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ఆదివారం సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ విక్రంనాథ్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వారికి ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదే విధంగా హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకటరమణ కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.

వాకర్స్ అసోసియేషన్ కమిటీ ఎంపిక



రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డి, కె.భాస్కర్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా పీసీ.రాయులు, అధ్యక్షుడిగా రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా కె.ఆర్ముగం, ఎం.జనార్ధన్‌రెడ్డి, ఎంఆర్.భారతి, ప్రధాన కార్యదర్శిగా కె.భాస్కర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా కె.విజయభాస్కర్‌రెడ్డి, ఏ.గోపియాదవ్, కె.ప్రసాద్, కోశాధికారిగా జి.పోతప్ప, అదనపు కోశాధికారిగా ఎస్.షాబుద్దీన్, గౌరవ సలహాదారులుగా డాక్టర్ వీఎస్ఆర్ ఆంజనేయులు, కె.రఘురామిరెడ్డి, పి.సుధాకర్‌రెడ్డి, పి.భాస్కర్ రెడ్డి, ఎల్.నాగరాజనాయుడు, బి.కాటమరాజు, వెంకటకిశోర్, గాదె సుబ్రమణ్యంరెడ్డి, 11 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

కోరలు చాస్తున్న ప్లాస్టిక్ భూతం

- గ్రామాల్లోనూ విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం
- రోజుకు సరాసరి మూడు టన్నుల చెత్త సేకరణ
- పర్యావరణానికి ముంచుకొస్తున్న ముప్పు


పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు

చంద్రగిరి: నియోజవర్గంలోని ఆరు మండలాల్లో ప్లాస్టిక్ కవర్ల విక్రయం యథేచ్ఛగా సాగుతోంది. 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం ప్లాస్టిక్ కవర్లు, వస్తువుల వినియోగాన్ని ప్రభుత్వం నిషేధించింది. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పర్యావరణ పరిరక్షణకు కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధికారులు నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వాడకంపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. నియోజవర్గంలోని చంద్రగిరి, తిరుపతి రూరల్, రామచంద్రాపురం, చిన్నగొట్టిగల్లు, పాకాల, ఎర్రావారిపాళ్యం పరిధిలోని గ్రామాల్లో ప్లాస్టిక్ కవర్ల వాడకం పెరిగిపోతోంది. ప్రతి ఆదివారం చంద్రగిరి, శనివారం తిరుపతి రూరల్, సోమవారం పాకాల, శుక్రవారం చిన్నగొట్టిగల్లు, రామచంద్రాపురం, శనివారం ఎర్రావారిపాళెం మండలాల్లో నిర్వహించే వారపు సంతల్లో 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్నారు. ఎక్కడ చూసినా చెత్తా చెదారంతో పాటు ప్లాస్టిక్ కవర్లు దర్శనమిస్తున్నాయి. వీటిని తిని పశువులు, పందులు ఇతర పెంపుడు జంతువులు మృత్యువాత పడుతున్నాయి.

అవగాహన లేమి

మార్కెట్‌లో ప్లాస్టిక్ పేపర్లకు ప్రత్యామ్నాయంగా జూట్(జనపనార) బ్యాగులు, పేపర్ బ్యాగులు అందుబాటులో ఉన్నాయి. పంచాయతీ స్థాయి అధికారులు వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్లాస్టిక్ పేపర్ల వాడకం వల్ల కలిగే నష్టాలు, ప్రత్యామ్నాయాలపై ప్రజలకు వివరించి చైతన్యవంతులను చేయాల్సి ఉంది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టకపోవడంతోనే ప్లాస్టిక్ వాడకం పెరిగిపోతోంది.

తిరుపతి రూరల్ మండలంలోనే అత్యధికం

తిరుపతి రూరల్ మండలంలో అత్యధికంగా చెత్తను సేకరిస్తున్నారు. రోజుకు సరాసరి 3 టన్నులకు పైగా చెత్తను సేకరిస్తున్నట్లు అధికారిక లెక్కల ద్వారా తెలుస్తోంది. తిరుచానూరు పంచాయతీలోనే 10 టన్నులకు పైగా పోగవుతోంది. ఈ లెక్కన తిరుపతి రూరల్ మండలంలోనే నెలకు సుమారు 98 టన్నుల చెత్తను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఆ చెత్తను తడి, పొడిగా వేరు చేసి రీసైక్లింగ్‌కు వినియోగిస్తున్నారు.

మండలాల వారీగా నెలకు సేకరించే చెత్త టన్నుల్లో

మండలం		
తిరుపతి రూరల్	:	98 టన్నులు
చంద్రగిరి	:	15.10 టన్నులు
రామచంద్రాపురం	:	01 టన్ను
పాకాల	:	13.3 టన్నులు
చిన్నగొట్టిగల్లు	:	2.5 టన్నులు
ఎర్రావారిపాళెం	:	1.75 టన్నులు
మొత్తం	:	131.3 టన్నులు

నిషేధిత కవర్లు విక్రయిస్తే చర్యలు

"40 మైక్రాన్ల కంటే తక్కువ మందం ప్లాస్టిక్ కవర్లు వాడకూడదు. చంద్రగిరితో పాటు గ్రామాల్లోని దుకాణాల్లో నిషేధిత కవర్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు దుకాణాన్ని సీజ్ చేస్తాం. దీనిపై మరోసారి ప్రజలకు, దుకాణదారులకు అవగాహన కలిపిస్తాం. వారిలో మార్పు రాకపోతే చర్యలు తీసుకుంటాం.

– రమేష్‌బాబు, ఎంపీడీవో, చంద్రగిరి

రూ.1.50 కోట్లతో వరవకాలువ పనులు


కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఉపసర్పంచ్ అశోక్‌రెడ్డి, లక్ష్మీనారాయణ

- సాకారమవుతున్న 30 ఏళ్ల కల
- హర్షం వ్యక్తం చేస్తున్న సప్తగిరినగర్ పంచాయతీ వాసులు

తిరుపతి మంగళం : మంగళంలోని సప్తగిరినగర్ పంచాయతీలో రూ.1.50 కోట్లతో వరవ కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. 30 ఏళ్ల నాటి కల నెరవేరుతుండడంతో స్థానికులు హర్షంవ్యక్తం చేస్తున్నారు. సప్తగిరి నగర్ పంచాయతీ తిరుపతి నగరానికి సమీపంలో ఉన్నా అభివృద్ధికి నోచుకోలేదు. రాళ్లు తేలిన రోడ్లతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వర్షాలు కురిసిన సమయంలో వరద నీరు వెళ్లేందుకు దారి లేక ఇళ్లలోకి చేరేది. గత టీటీడీ ప్రభుత్వంలో వరవ కాలువ నిర్మించాలని అధికారులు, నాయకుల చుట్టూ తిరిగినా ఫలితం లేదని స్థానికులు చెబుతున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన మూడన్నరేళ్లలోనే ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవ తీసుకుని అన్ని వీధుల్లోనూ సిమెంట్ రోడ్లు వేయించారని, ఇప్పుడు రూ.1.50 కోట్లతో వరవ కాలువ నిర్మాణ పనులు చేపట్టి 30 ఏళ్లుగా తాము పడుతున్న కష్టాలను తీరుస్తున్నారని పేర్కొంటున్నారు. ఈ కాలువ నిర్మాణం పూర్తయితే వరద నీరు సప్తగిరి కాలనీ నుంచి అంబేడ్కర్ కాలనీ, వెంకటేశ్వరకాలనీ మీదుగా కరకంబాడి ప్రధాన మార్గంలో కలుస్తుంది. ఎంతటి వర్షాలు వచ్చినా కాలనీల్లోకి వరదనీరు చేరదని స్థానికులు చెబుతున్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సాకారంతోనే పంచాయతీలో అభివృద్ధి పనులు చేయగలుగుతున్నామని ఉప సర్పంచ్, అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, రణధీర్‌పురం పంచాయతీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తెలిపారు.

సేవ చేయడంలోనే సంతృప్తి


అన్నదానం చేస్తున్న ఆర్టీసీ ఎన్ఎంయూఏ నేతలు

తిరుపతి అర్బన్ : సేవ చేయడంలోనే ఆత్మ సంతృప్తి లభిస్తుందని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బీఎస్ బాబు పేర్కొన్నారు. ఎన్ఎంయూఏ వ్యవస్థాపకులు రామ్మోహన్ రావు 18వ వర్ధంతి సందర్భంగా తిరుపతి డిపో అధ్యక్షుడు భాస్కర్, కార్యదర్శి దాము ఆధ్వర్యంలో తిరుపతి బస్టాండ్ వద్ద ఆదివారం అన్నదానం చేశారు. బీఎస్ బాబు మాట్లాడుతూ రామ్మోహన్ రావు ఆర్టీసీకి చేసిన సేవలను కొనియాడారు. ఈ క్రమంతోనే ప్రతిఏటా 500 మందికి అన్నదానం చేయడంతోపాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి తాళ్ల మోహన్, డిపో చైర్మన్ రమణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ దినకర్, అసిస్టెంట్ సెక్రటరీ ఎస్ఆర్ కుమార్, ఆర్ఎస్ నాయుడు, పద్మనాభం, మధు, పీఎస్ మణ్యం తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో 8న హోలి సంబరాలు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏఓ ఖాదర్‌వలి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో 8న హోలి సంబరాలను నిర్వహించనున్నట్టు ఏఓ ఖాదర్‌వలి తెలిపారు. ఆయన ఆదివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతిలోని లండన్ బ్యూటోరియం, బ్రైడల్ మేకప్ ఆర్థిక సాయంతో హోలి పండుగ వేడుకలు నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు. ఇందులో వయసుతో సంబంధం లేకుండా అందరికీ ఆహ్లాదం కలిగించేలా డీజే మ్యూజిక్, రెయిన్ డ్యాన్స్, తీన్మార్ బ్యాండ్, హైదరాబాద్‌కు చెందిన డీజే మాస్టర్‌తో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రసాయనాలు వినియోగించని రంగుల ద్వారా నిర్వహించే హోలి పండుగలో అందరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. హోలి పండుగకు సంబంధించిన టికెట్లు కావాల్సిన వారు 8328132915, 9052670090లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ప్రియ సందీప్, హరి, శ్రీధర్, నందా సందీప్ పాల్గొన్నారు.

రామకృష్ణ మఠంలో విద్యార్థులకు పోటీలు


బహుమతులు అందజేస్తున్న సుకృతానందస్వామి

తిరుపతి కల్చరల్: ఇస్కాన్ రోడ్డులోని రామకృష్ణ మఠం ఆశ్రమంలో ఆదివారం విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఆశ్రమ కార్యదర్శి సుకృతానందస్వామి ఆధ్వర్యంలో 8 నెలలుగా చేపడుతున్న ఆధ్యాత్మిక అంతరయోగం బాల సంస్కార కార్యక్రమంలో భాగంగా పఠనం, యోగా, భజనలు, స్టోరీ టెల్లింగ్, చాటింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. యోగా విభాగంలో జ్ఞానప్రసూన, నీరజ్‌కుమార్, హరదీప్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. అలాగే వేద పఠనంలో పావులూరు ఏషిత, లహరి, మనోజ్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు, స్టోరీ టెల్లింగ్‌లో నీరజ్‌కుమార్, వి.జ్ఞాన ప్రసూన, శారద ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. భజనల విభాగంలో నీరజ్‌కుమార్, ప్రసన్న లక్ష్మీ, హిషిత ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులు పొందారు. ఆశ్రమ కార్యదర్శి సుకృతానందస్వామి భక్తులతో సామూహిక మార్గనిర్దేశిత ధ్యానం చేయించారు.

వంశీపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు

- నిందితుల కోసం గాలింపు చర్యలు
- సీఐ ఓబులేశు


వివరాలను వెల్లడిస్తున్న సీఐ ఓబులేశు

చంద్రగిరి: తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నందుకు ఆవేదన చెందిన భర్త ఫేస్‌బుక్‌లో పోస్టు చేసినందుకు చితకబాది, గుండు కొట్టించిన ఘటనపై పోలీసులు ఎట్టకేలకు స్పందించారు. అజ్ఞాతంలో ఉన్న బాధితుడు వంశీ శనివారం అర్ధరాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో నిందితులు అన్వర్, హర్షతో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేశారు. సీఐ ఓబులేశు, ఎస్ఐ వంశీధర్ ఆదివారం మీడియాకు వివరాలు వెల్లడించారు. ఏ.రంగంపేటకు చెందిన వంశీ నాలుగేళ్ల క్రితం హైదరాబాద్‌లో పనిచేస్తున్న క్రమంలో కరీంనగర్‌కు చెందిన మహిళను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. తర్వాత కాపురాన్ని ఏ.రంగంపేటకు మార్చాడు. చంద్రగిరికి చెందిన హర్ష వద్ద ఆటోను బాడుగకు తీసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్యాభర్తలు తరచూ గొడవ పడేవారు. హర్ష వారిద్దరికి సర్ది చెబుతూ వచ్చాడు. నాలుగు నెలల క్రితం వారి మధ్య గొడవ తీవ్ర స్థాయికి చేరుకోవడంతో వంశీని విడిచి మహిళ కరీంనగర్‌కు వెళ్లింది. వంశీ బెంగళూరులో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. తన భార్య హర్షతో వివాహేతర సంబంధం పెట్టుకుందని అనుమానించిన వంశీ వారిద్దరూ చనిపోయినట్లు రిప్ అంటూ ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టాడు. దీన్ని జీర్ణించుకోలేని హర్ష, అతని స్నేహితుడు అన్వర్ సాయంతో గత నెల 9న బెంగళూరుకు వెళ్లి వంశీని బలవంతంగా చంద్రగిరికి తీసుకువచ్చాడు. శివారు ప్రాంతంలోని పొలంలో వంశీపై విచక్షణ రహితంగా దాడి చేసి గుండు కొట్టించాడు. ఈ వీడియోలు వైరల్ అయ్యాయి. బాధితుడు రెండు రోజులుగా కనిపించకపోవడంతో కేసు నమోదు చేయలేక పోయామని, శనివారం రాత్రి బాధితుడు ఫిర్యాదు చేయడంతో అన్వర్, హర్షతో పాటు మరికొందరిపై సెక్షన్ 365, 342, 323, 324, 355, 506, రెడ్‌విత్ 34 ఐపీసీ కింద కిడ్నాప్, నిర్బంధం, దాడి చేయడం, గుండు కొట్టించడం వంటి కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. బాధితుడిని వైద్య పరీక్షలకు పంపామని, రిపోర్ట్ ఆధారంగా కేసును దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

నిందితుల కోసం ముమ్మర గాలింపు చర్యలు

నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాల ద్వారా గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుని వివరాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని మీడియాకు వివరించారు.

ఆటో డ్రైవర్లకు వైద్య పరీక్షలు


ఆటో డ్రైవర్లకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిరుపతి కల్చరల్: టాటా ట్రస్ట్, ఎస్‌వీఐసీసీఏఆర్ఈ సహకారంతో బీఆర్.అంబేడ్కర్ తల్లిదీవెన ఆటో స్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం విష్ణు నివాసం ఎదురుగానున్న ఫ్రీ బస్టాప్ వద్ద ఆటో డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆటో స్టాండ్ యూనియన్ అధ్యక్షుడు పల్నాటి బాలకృష్ణ మాట్లాడుతూ బతుకుదెరువు కోసం నిరంతరం శ్రమించే ఆటో డ్రైవర్ల ఆరోగ్యం కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం సుమారు 500 మందికి క్యాన్సర్, డెంటల్, బీపీ, షుగర్, నోటి క్యాన్సర్ తదితర పరీక్షలు చేశారు. అలమేలు చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్ ప్రతినిధి పీవీ.హేమంత్‌కుమార్, కృష్ణతేజ డెంటల్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ పత్రాలతో భూములు కాజేశారని ఫిర్యాదు

చంద్రగిరి : నకిలీ పత్రాలు సృష్టించి చంద్రబాబు అలియాస్ చెంగల్రాయులు తమ భూములు కాజేశాడని కల్‌రోడ్డుపల్లెకు చెందిన దొండపాటి లోకేష్ ఆరోపించారు. ఆయన ఆదివారం చంద్రగిరిలో విలేకరులతో మాట్లాడారు. పనపాకం రెవెన్యూ పరిధి గడ్డకిందపల్లెలో సర్వే నంబర్ 264ఏ/3లో తమకు 3.19 ఎకరాలు ఉందన్నారు. దాన్ని కొత్తయిండ్లుకు చెందిన చంద్రబాబు తన కుటుంబీకుల పేరుపై మార్చేసుకున్నారన్నారు. మరో 10 మంది భూములను కూడా నకిలీ పత్రాలతో కాజేసి, జాతీయ రహదారి విస్తరణలో రూ.11.5 లక్షల పరిహారం తీసుకున్నట్లు వెల్లడించారు. చంద్రబాబు నకిలీ సర్టిఫికెట్ తీసుకుని సీఐఎస్ఎఫ్‌లో ఉద్యోగం కూడా పొందాడని వివరించారు. ఇప్పుడు ఉద్యోగ విరమణ చేశాడని పేర్కొన్నారు. పెన్షన్ కూడా తీసుకుంటున్నాడని తెలిపారు. దీనిపై ఇప్పటికే చెన్నైలోని సీఐఎస్ఎఫ్ సౌత్‌జోన్ ఐజీ, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ డీజీ, జిల్లా కలెక్టర్, ఎస్పీ, స్టేట్ విజిలెన్స్ కమిషన్‌కు రిజిస్టర్ పోస్టు ద్వారా ఆధారాలతో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వాన్ని, ప్రజలను మోసం చేసిన చంద్రబాబుపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

తిరుపతి గంగమ్మకు విశేష పూజలు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు చెరువు కట్ట మీద వెలసిన తిరుపతి గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం పాల్గుణమాసం, శిశిర రుతువు పర్వదినం పురస్కరించుకుని అభిషేకాలు, అర్చనలు చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు ఆలయ ధర్మకర్తలు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మంత్రి పెద్దిరెడ్డిపై లోకేష్ విమర్శలు విడ్డూరం


మీడియాతో మాట్లాడుతున్న మల్లారపు మధు

తిరుపతి కల్చరల్: ఉమ్మడి చిత్తూరు జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై పాదయాత్రలో నారా లోకేష్ విమర్శలు చేయడం విడ్డూరమని వైఎస్సార్ సీపీ దళిత విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు తెలిపారు. ఆయన ఆదివారం ఆర్ అండ్ బీ విశ్రాంతి భవనం వద్ద మీడియాతో మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాల వారిని ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేసిన చరిత్ర చంద్రబాబుదని తెలిపారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన నీ తండ్రి చంద్రబాబు ఏనాడూ బలహీన వర్గాల వారి సంక్షేమానికి కృషి చేయలేదని పేర్కొన్నారు. ప్రజలకు ఏమి చేస్తారో చెప్పకుండా అధికార పక్షంపై ఆరోపణలు చేయడం లోకేష్ కుటిల రాజకీయానికి నిదర్శనమన్నారు. స్థాయిని మరిచి విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. హరిచౌహాన్‌నాయక్, రాజశేఖర్, చంద్రశేఖర్ నాయక్, ఖాసీం, వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా రెడ్ చెర్రీస్ స్కూల్ వార్షికోత్సవం


నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు


ఎమ్మెల్యే భూమనను జ్ఞాపికతో సత్కరిస్తున్న రెడ్ చెర్రీస్ స్కూల్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : పీఎల్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం రెడ్ చెర్రీస్ స్కూల్ 11వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వేడుకలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యావిజ్ఞానం విద్యార్థుల ఉజ్వల భవితకు పునాది అని, ప్రతి విద్యార్థీ ఇష్టపడి చదువుతూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ సునీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విలువలతో కూడిన, సృజనాత్మక విద్యను అందించడంలో రెడ్ చెర్రీస్ ముందుంటుందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. ప్రిన్సిపాల్ పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

తిరుపతి అలిపిరి: పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యత కలిగి ఉండాలని జిల్లా అటవీశాఖ అధికారి సతీష్‌రెడ్డి తెలిపారు. తిరుపతి నగరవనంలో ఆదివారం యంగిస్తాన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. వారిని జిల్లా అటవీశాఖ అధికారి సతీష్‌రెడ్డి అభినందించారు. శుభ్రతలో యువత పాత్ర ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు.

చిన్నగొట్టిగల్లులో కుక్కల బెడద


రోడ్డుపై తిరుగుతున్న కుక్కలు

భాకరాపేట : మండల కేంద్రమైన చిన్నగొట్టిగల్లు, మేజర్ పంచాయతీ భాకరాపేటలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కుక్కలు ఇంటి ముందున్న కోళ్లను తినేస్తున్నాయి. ద్విచక్ర వాహనాల్లో వారిపై దాడికి దిగుతున్నాయి. జాతీయ రహదారిపై ఎక్కడ పడితే అక్కడ గుంపులుగా సంచరిస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుక్కల బెడదను నివారించాలని పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



విశేషాలంకరణలో తాతయ్యగుంట గంగమ్మ, గంగమ్మ ఆలయ పురాతన రాతి స్తంభాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష


దినకరుడు హస్తాద్రికి చేరుతుండగా ఆకాశం ఎర్రగా మారింది. పిట్టలు సూర్యుడిపై చేరాయా అన్నట్టు కనిపిస్తున్న దృశ్యం తిరుపతిలోని వ్యవసాయ పరిశోధనా స్థానం వద్ద కనిపించింది. ఆహ్లాదాన్ని పంచింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి